మంచం మీద నిద్రపోతున్న 'అభి'ని అలానే చూస్తోంది పెద్దామె. ఆమె భాగ్యమ్మగారు. కన్నకొడుకును, కట్టుకున్న భర్తను పోగొట్టుకుని, తలచెదిరిన కోడలు, చిన్నపిల్లలతో దిక్కులేని బాధాతప్త హృదయినిలా, తయారైంది. ఆమె బాధ! వ్యధ తీరేవి కావు.

* * *

అభికి అమ్మ, నానమ్మ చెప్పవల్సినవన్నీ చెప్పారు. ఎలా మసులుకోవాలో చెప్పారు. కుటుంబ పరిస్థితిని, భవిష్యత్తును వాడికి ఈ నాల్రోజుల నుండీ చెప్తూనే ఉన్నారు. వాడిలో ఎంతో మార్పు స్పష్టంగా గోచరిస్తోంది. అన్నీ గ్రహించినవాడిలా మారు మాటాడక తలూపుతున్నాడు. నిజానికి వాడు ఏనాడో మానసికంగా సంసిద్ధుడై ఉన్నాడనే చెప్పాలి.

ఆరోజు రానే వచ్చింది. హైదరాబాదు నుంచి వచ్చిన ఆత్మీయ దంపతులు పిల్లాణ్ణి గురించి ఏం బెంగపడకండని చెప్తున్నారు.

పుస్తకాలు, బట్టలు అన్నింటిని వాడి బ్యాగ్‌లో సర్దుకున్నాడు అభి. వాడు ప్రయాణానికి సిద్ధమవుతుంటే కుటుంబంలోవారికి గుండెల్లో చెప్పలేనంత దిగులు! ఏదో తెలీని బాధ! చివరకు ఈ రకంగా జీవితం పరిణమించిందా? బస్టాండ్ దాకా వెళ్ళేటందుకు వీధి చివర్లో రిక్షా వచ్చి ఆగింది.

వాకిట్లో మెట్ల వద్ద నిలబడ్డ అక్క- అనిల వద్దకు వచ్చాడు. అభి అన్నాడు.

"అక్కా-రోజూ సాయంత్రం నానమ్మకు కాళ్ళు నొప్పులు! రేపట్నుంచి నువ్వే కాళ్ళు పట్టాలి. పాపం! నానమ్మను బాధపడనీయకు!"

మౌనంగా తమ్ముడి కళ్ళల్లోకి చూస్తూ తలాడించింది అనిల.

చెల్లెలు కీర్తన దగ్గరకొచ్చాడు. "కీర్తీ! అవి కొనిపెట్టు ఇవి కొనిపెట్టు అంటూ అమ్మను, నాన్నమ్మను విసిగించకు- ఏడిపించకు! మనకు డబ్బులెలా వస్తాయ్ చెప్పు! నేను హైదరాబాద్ నుండి వచ్చేటప్పుడు నీకు వీడియో గేమ్స్, రేస్, పాప్‌కార్న్, క్రీమ్ బిస్కెట్లు అన్నీ తెస్తాను."

"ఇన్ని తేవాలి" అంటూ అన్న కళ్ళల్లోకి చూస్తూ చేతులను చాపింది.

ఈ మాటలను పెద్దలు ఎవ్వరూ విన్లేదు. ఎవరి ధ్యాసలో వారు.

ఈ వయసులోనే ఎన్ని పెద్దరికపు లక్షణాలు! ఎదురైన అనుభవాల సారమే ఆ పలుకులు. రిక్షా అబ్బాయి వచ్చి అభి చేతిలోని బ్యాగును "ఇటివ్వు బాబూ!" అన్నాడు.

"వద్దు! నేనే తెస్తాను. పద" అన్నాడు. ముక్కు పచ్చలారని బిడ్డడు అంటున్న మాటగా లేదు అది.

హైదరాబాద్ దంపతుల వెంట బ్యాగ్ పట్టుకొని, వీధి మలుపు సిమెంటు రోడ్డుపై ఉన్న రిక్షా కేసి వాడు నడుస్తుంటే-

వర్తమానాన్ని మోసుకుంటూ భవిష్యత్ వెలుగుకై అడుగులేస్తున్న 'స్థిరచిత్తుడినే' తలపించేలాగున కన్పించాడు. వాడి ముఖంలో పరిణతి చెందిన భావాలు తారాడుతున్నాయి.గుండెలనిండుగా ఆత్మస్థైర్యాన్ని నింపుకుంటూ జీవిత పోరాటంలో 'యోధుని'లా అడుగేస్తున్నాడనిపిస్తుంది. అనుభవాల రాపిడిని తట్టుకుంటూ...వాడు..అభి! అభి!

నిండా పదేళ్ళు నిండనివాడు!

**-దానం శివప్రసాదరావు (మాచర్ల)**

# (అ) ధర్మకర్త

"ఇదుగో నిన్నే" అటువైపు తిరిగి పడుకున్న శ్యామలను పిలిచాడు సీతారాం.

"ఏమిటి?" మగతగా కళ్ళను విప్పి అడిగింది శ్యామల.

"రేపు, ఎల్లుండి కూడా మనకు ఈ గదే కేటాయించారు మీ వాళ్ళు"

ఒక్కసారిగా మత్తు వదిలిపోయింది శ్యామలకు, మూడు రాత్రులు మాట వినేసరికి.

సీతారాం వైపు తిరుగుతూ "అయితే ఏంటంట" అంది.

"అదికాదు ఈ చిన్నగది మాత్రమే మీ మొత్తం యిల్లు. మీ వాళ్లంతా పాపం బయట వున్నారు. మనం, మా ఇంటికి లేదా ఎటైనా వెళ్లిపోతే బావుండేది కదా అన్నది నా ఉద్దేశ్యం"

తన వాళ్ల గురించి భర్త ఆలోచించడం శ్యామలకు ఆనందం కలిగించింది. నిజమే, నిన్ననే పెళ్లయిన తమ ఇద్దరి కోసం ఒకే గది, వసారా వున్న ఇంట్లో, ఆ గది తమ యిద్దరికీ ఇచ్చేసి, పెళ్ళికి వచ్చి ఇంకా వెళ్లని దగ్గర బంధువులతో సహా అమ్మా నాన్న, ఇద్దరు చెల్లెళ్లు అంతా పాపం బయట పడుకున్నారు. తను అత్తవారింటికి వెళ్లేటప్పుడు తీసుకు వెళ్లవలసిన సారె సామానులన్నీ తమ గదిలోనే వున్నాయి. అరటిపళ్లు ఆ మూల, ఈ మూల వుండి అర ముగ్గిన వాసన, చిదికిపోయిన లడ్డూలు, కారప్పూస వాసన గదంతా వేస్తోంది. సినిమాల లోనూ, టీవీ సీరియల్స్‌లోనూ చూపించే శోభనం గదిలా లేదది. స్టోర్ రూమ్‌లా వుంది.

శ్యామలకు నిజానికి ఆ గది ఎంతో ఇష్టమైనది. ఆ గదిలోనే పుట్టింది. ఆ గదిలోనే తను పెరిగింది. ఆ గదిలోనే బొమ్మలతో ఆడుకుంది. ఆ తర్వాత చెల్లెళ్లతో, స్నేహితురాళ్లతో ఆడుకుంది. ఆ గది కిటికీలోనుండే నాన్న కోసం ఎదురుచూసింది. ఆ గది గోడలోకే అద్దం పెంకు పెట్టి చుట్టూరా మన్ను రాసి, దిగువన గట్టులాగా మన్ను మెత్తి డ్రెస్సింగ్ మిర్రర్ చేసుకుంది. అప్పటికి ఇప్పటికి ఏం మార్పులేదు ఆ గదిలో, మార్పంతా తనలోనే.

ఎదురింటి ఎస్సైగారి ఇంట్లోని గోడ గడియారం ఠంగు ఠంగుమని ఆరు గంటలు కొట్టింది. అదెప్పుడూ శ్యామలకు అలవాటే కానీ మరేదో శబ్దం కూడా వినిపించడంతో ఠక్కున లేచింది శ్యామల. ఒంటి మీద బట్టలన్నీ సర్దుకొని కిటికీ తెరచి చూసింది. బయట అందరూ ఏదో గందరగోళంగా వున్నట్లున్నారు. ఏం జరుగుతుందో అర్థంకాక తలుపులు తెరచి, ఒక్కవుదుటన బయటకు వచ్చింది శ్యామల. రెండు బుల్‌డోజర్లు, ఒక పోలీస్ వ్యాన్. మరొక జీపు చాలామంది మనుష్యులు వున్నారు ఆ వీధి పొడుగునా. వాళ్లందరిలోకి చూస్తున్న శ్యామలకు పెద్ద పెద్ద మీసాలున్న ప్రకాశం కనిపించాడు. అంతా అర్థం అయిపోయింది శ్యామలకు, తమ కొంప కూల్చేస్తున్నాడు ప్రకాశం.

* * *

కరువుకి దాసర్లవడమంటే ఇదేనేమో, వ్యవసాయం చేస్తే గిట్టుబాటు అవ్వడం లేదు, కానీ పెద్ద పెద్ద జమీందార్లు వందలు వందలు ఎకరాలు కొనేసి, వ్యాపారం పంటలు పండిస్తూ వ్యాపారాలు చేసుకుంటూ, మరింత ధనవంతులు అవుతున్నారు. ఆ పెద్ద వ్యాపారులకు భూమి అమ్ముకున్న వాళ్లే అందులోనే కూలి పనులు చేసుకోవచ్చేమో అనుకుంటే, నాగళ్లతో దున్నడానికి బదులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. గొప్పులు అంతే, కోతలు అంతే, నూర్పులు అంతే, నీళ్లు పోత అంతే, మోతలు అంతే అన్నింటికీ మిషన్లు, మిషన్లు. మరి పనుల్లేక ఊరొదిలి కడుపుతో వున్న భార్యతో విజినగరం వచ్చేశాడు రాజారావు. రాజారావు నేస్తం అప్పలరాజు అంతకు ముందుటేడు విజినగరం వచ్చి సిలవరి కంపెనీలో పనికి కుదిరిపోయాడు. ఊరికి చివర్లో ఒక చిన్న గది అద్దెకు తీసుకొని వున్నాడు. ఎప్పుడొచ్చినా పని చూస్తానని చెప్పాడు అప్పలరాజు రాజారావుతో. ఆ ధీమాతోనే రాజారావు సతీసమేతంగా వచ్చేశాడు. అనుకున్నట్టుగానే, రాజారావుకి తను చేస్తున్న కంపెనీలోనే పనికి కుదిర్చాడు అప్పలరాజు. అలవాటు లేని యంత్రాల మధ్య అలవాటు లేని పని. అప్పలరాజు ఇంటి వాసలోనే ఇల్లు చూశాడు రాజారావుకి. చిన్న గది, వసారా. ఆ వాసలో వున్న ఇళ్ళన్నీ అంతే.

గుడికి ఓ ప్రక్క వున్నాయి ఇళ్లన్నీ. గుడి ఓ ధర్మకర్తది. ఇల్లు కట్టుకున్న వాళ్లంతా ధర్మకర్తకు నెల నెలా అద్దె కూడా చెల్లించే వాళ్లు. ఆ తర్వాత, ఆ గుడిని ఆనుకొని వున్న ఈ యిళ్లన్నీ ఖాళీ చేయాలని ధర్మకర్త హుకుం జారీ చేశాడు. నెల నెలా అద్దెలు చెల్లిస్తూ వున్నామని, ఆ ఇళ్ల వల్ల గుడికి ఆదాయమే తప్పితే, ఎలాంటి అవరోధమూ లేదని, చిన్న చిన్న బ్రతుకులు బ్రతుకుతున్న మమ్మల్ని వీధుల పాలు చేయవద్దని ఎంత బ్రతిమలాడుకున్న వినలేదు. చివరకు కోర్టుకు కూడా వెళ్లారు. కోర్టులో కొన్నాళ్లు వాద ప్రతివాదనలు జరిగాయి. కానీ, ధర్మకర్తకే ఆస్తి చెందాలని న్యాయస్థానం తీర్పు యివ్వడంతో ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి, ఇళ్లన్నీ నేల మట్టం చేయడానికి బుల్‌డోజర్లు, పోలీసులు వగైరా మంది మార్బలంతో ప్రకాశం వచ్చాడు.అరగంటలో ఇళ్లలో నుండి సామానులు బయటకు విసిరేసి, ఇళ్లన్నీ కూల్చేశాడు. ఎదురు తిరిగిన వాళ్లందరినీ, పోలీసులు చితకబాదారు. న్యాయస్థానం తీర్పుని గౌరవించకపోతే నేరమవుతుందని మౌనంగా భరించారు కొందరు. అలా ఆ ఇల్లు నేలమట్టం కావడంతో అప్పుడే పెళ్లి అయిన ఆ కుటుంబం అంతా వీధిన పడింది. చుట్టాలు పక్కాలతో, కట్టుబట్టలతో, మిగిలిన సామానుతో రోడ్డున పడింది రాజారావు కుటుంబం. చాలీ చాలని కూలి డబ్బులతో బ్రతుకులీడుస్తున్న అక్కడి వాళ్లంతా ఏం చెయ్యాలో తోచక, చెట్టుకో పుట్టగా అయ్యారు.

ఇల్లు పొల్లు లేని వాళ్లతో నీకు పెళ్లేంటని తల్లిదండ్రులు చెప్పడంతో, శ్యామలను గాలికి వదిలేసి, సీతారాం వెళ్లిపోయాడు. మూడునాళ్లకే శ్యామల బ్రతుకు బండలయింది ధర్మకర్త పుణ్యమాని.

**-ఎన్.కె.బాబు (విజయనగరం)**